క్లుప్తంగా

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన



సామర్లకోట రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీ గీత

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ వంగా గీత శుక్రవారం పరిశీలించారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో ఒకటో నెంబరు ప్లాటు ఫాంపై షెడ్లు, స్టేషన్ మేనేజరు, సిగ్నల్ వ్యవస్థ కార్యాలయానికి చెందిన భవన నిర్మాణం, ప్రయాణికులు వెయింటింగ్ హాల్ పనులను ఆమె పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రైల్వే స్టేషన్‌కు అమృతభారత్ పథకంలో మంజూరైన రెండో కాలిబాట వంతెన, ఎస్క్యులేటర్ పనులను వేగంగా ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవికాంత్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఏవీకె సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయం వైపు వైఎస్సార్ సీపీ అడుగులు



నియోజకవర్గ పరిశీలకుడు, ఐ ప్యాక్ టీమ్ సభ్యులతో మాట్లాడుతున్న సునీల్

సామర్లకోట: అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించే దిశగా అడుగులు వేయాలని పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ అన్నారు. పార్టీ పరిశీలకులు చీకట్ల కిశోర్, ఐ ప్యాక్ టీమ్‌తో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఓటు చాలా ముఖ్యమైనదని, దీని కోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నించేలా చూడాలన్నారు. ఐ ప్యాక్ టీమ్ నియోజకవర్గ పరిధిలో పలు సూచనలు చేసింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అధ్యక్షత వహించారు.

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిని కలసిన న్యాయమూర్తులు

కాకినాడ లీగల్: మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానందను కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవితో పాటు న్యాయమూర్తులు మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఆయన వ్యక్తిగత వ్యవహారాల కోసం కాకినాడ వచ్చి ఒక హోటల్‌లో ఉన్నారు. ఆయన గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్నారు.

పీహెచ్‌డీకి అవకాశం కల్పించాలి

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీలో ఆర్‌సెట్ అభ్యర్థులకు గ్రంథాలయ శాస్త్రంలో పీహెచ్‌డీ అవకాశం కల్పించాలని గోదావరి లైబ్రేరీ అసోసియేషన్ శుక్రవారం వీసీ ప్రసాదరాజుకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ప్రతి ఏడాది లైబ్రరీ సైన్స్ విభాగంలో రెండు పీహెచ్‌డీ సీట్లు కేటాయించేవారని, ఈ ఏడాది వెబ్‌సైట్‌లో అవకాశం లేనట్లుగా చూపిస్తున్న తరుణంలో దీనిపై పునరాలోచించాలని అసోషియేషన్ కార్యదర్శి కె.సాయిబాబు కోరారు. వర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల్లో ఎంతో మంది గ్రంథాలయశాస్త్రంలో పీహెచ్‌డీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు.

పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ

కాకినాడ సిటీ: కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని భవనాలు, ఖాళీ స్థలాలపై పేరుకుపోయిన పన్ను బకాయిలపై ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పించిందని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటరావు శుక్రవారం సాయంత్రం తెలిపారు. పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి యజమానులు ఆస్తి పన్నులపై బకాయిలతో సహా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023–24 మార్చి వరకు మొత్తం బకాయిలు ఈనెల 31వ తేదీ నాటికి చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళపై ఇటుకతో దాడి

కిర్లంపూడి: మహిళపై ఇటుకతో దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై షేక్ జబీర్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గెద్దనాపల్లిలో ఇరుగుపొరుగున నివసిస్తున్న పంతం మేరీ ఇంటి నుంచి పంతం కేశవరావు ఇంటి వైపు నీరు వస్తోందంటూ ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ గొడవలో కేశవరావు ఇటుకతో మేరీపై దాడి చేయగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై జబీర్ తెలిపారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా జగన్ పాలన

- నియోజకవర్గ పరిధిలో 400 గ్రామాలు దత్తత
- గ్రామానికి రూ.కోటి చొప్పున అభివృద్ధి నిధులు
- పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి సునీల్



మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం.. సభలో మాట్లాడుతున్న సునీల్

సామర్లకోట: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. శుక్రవారం రాత్రి సామర్లకోట–పెద్దాపురం రోడ్డులోని ప్రైవేటు లే అవుట్‌లో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాల అమలుకు వారధులుగా అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసేలా చూడాలన్నాను. మరో పర్యాయం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మరింత మేలు జరుగుతుందరు. ఆయన చేసిన సంక్షేమ పథకాలే ఎన్నికల్లో పోటీ చేసే నాయకులకు కొండంత బలమని తెలిపారు. పేదలు అభివృద్ధి చెందితే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందనే నమ్మకంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకునే ఆయన నాయకత్వంలో పని చేయాలని పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని చెప్పారు. ప్రతీ గ్రామంలో సచివాలయాలు, హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం అభివృద్ధి కాదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు మంచి చేయాలనే ఎంపీ అభ్యర్థిగా నేను, పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా దొరబాబు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రానున్న ఐదేళ్లలో 400 గ్రామాలను దత్తత తీసుకుని వాటిని రూ.400 కోట్లతో అభివృద్ధి చేస్తానని సునీల్ ప్రకటించారు. పార్లమెంట్ పరిధిలో సొంత మేనిఫెస్టో ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల సమయం తక్కువగా ఉండటంతో కార్యకర్తలు, అభిమానులే పార్టీకి అండ అని అన్నారు.

పెద్దాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ అమలాపురం నుంచి వచ్చి రామేశ్వరం మెట్ట ద్వారా రూ.కోట్లు సంపాదించవచ్చునని నిరూపించిన శాస్త్రవేత రాజప్ప అన్ని అన్నారు. స్థానికుడైన నాకు అవకాశం ఇచ్చి స్థానికేతరులను తరిమి కొట్టాలన్నారు. స్థానికులతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని దొరబాబు పిలుపునిచ్చారు. రాజప్ప దత్తత తీసుకున్న జె.తిమ్మాపురంలో అనేక సమస్యలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు మాట్లా డుతూ ప్రజల కోసం పని చేసే నాయకులను గెలిపించుకొవాలని పిలుపు నిచ్చారు. పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు చీకట్ల కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు జక్కంపూడి గణేష్, అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఆవాల రాజేశ్వరి మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్‌లు ప్రసంగించారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, మాజీ చైర్మన్ మోరంపూడి రంగనాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్, దొరబాబులను గజమాలతో సత్కరించారు.

వీకే రాయపురం నుంచి తరలివెళ్లిన కార్యకర్తలు



వీకే రాయపురం నుంచి తరలివెళ్లిన కార్యకర్తలు

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమీక్షా సమావేశం సందర్భంగా శుక్రవారం సాయంత్రం సామర్లకోట మండలం వీకే రాయపురం నుంచి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ ఆధ్వర్యంలో మొదటి సారిగా నియోజకవర్గం కార్యకర్తల సమీక్షా సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. జిల్లా పార్టీ కార్యకర్తల తరఫున దొరబాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివచ్చారు. సామర్లకోట–పెద్దాపురం రోడ్డులోని ప్రసన్నాంజనేయ ఆలయం సమీపంలో ఉన్న ప్రైవేటు లే అవుట్‌లో నిర్వహించిన సమీక్షకు నియోజక వర్గంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

పెయింటర్లను ఆదుకుంటాం



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దొరబాబు

పెద్దాపురం: పట్టణ పెయింటింగ్ కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ పెయింటింగ్ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కో–ఆర్డినేటర్ దొరబాబు మాట్లాడుతూ కార్మికులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుంది, తన వంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ అందిస్తానని అన్నారు. కార్మికుల అభ్యర్థన మేరకు యూనియన్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విడదాసరి రాజా, త్సలికి సత్యభాస్కర్, కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, పార్టీ నాయకులు తాడి రాజశేఖర్, నాగబోయిన రాజుబాబు తదితరులున్నారు.

3న పల్స్ పోలియో

సామర్లకోట: దేశ వ్యాప్తంగా జరుగుతున్న పల్స్ పోలియోలో భాగంగా ఆదివారం మూడో తేదీన మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులోను పల్స్ పోలియో నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు తల్లిదండ్రులు విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. హెల్త్ సిబ్బందితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో 35 సెంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్‌లతో పాటు మొబైల్ వాహనం ద్వారా పోలియో చుక్కలు వేయనున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ఇంటర్ పరీక్షలు రాయడానికి జూనియర్ కళాశాలకు వెళుతున్న విద్యార్థులు

సామర్లకోట: ఇంటర్‌మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణ పరిధిలోని వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సెంటర్‌గా ఇచ్చారు. ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ట్రైనీ డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కళాశాలలో ఒకేషనల్, జనరల్ విద్యార్థులు 620 మంది మొదటి రోజు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 597 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ పి.ఈశ్వర్ తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 11 మంది గైర్హాజరు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ తెలిపారు. మొత్తం 230 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 219 మంది హాజరయ్యారని చెప్పారు.

మరిడమ్మకు పూజలు



బంగారు, వెండి పుష్పాలతో అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేవారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా శుక్రవారం సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. తెల్లవారుజాము నుంచే గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 12841 మంది పింఛనుదారులు ఉండగా తొలిరోజు రోజు 70 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. నూరు శాతం పింఛన్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పింఛన్ల పంపిణీలో వలంటీర్లు నిర్లక్ష్యం వహించినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఇంటికే పింఛన్లు అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

జగ్గంపేట: గండేపల్లి మండలం సీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన బొడ్డు తాన్విక అనే 14 నెలల బాలిక ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతోంది. ఆమె వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.90 వేలు మంజూరైంది. ఈ చెక్కును మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం జగ్గంపేట ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం బాధిత చిన్నారి తల్లి దేవికి అందజేశారు.

స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించాలి

- ఈఆర్వో, ఆర్డీఓ రామారావు
- ఎన్నికల సిబ్బందికి దిశానిర్దేశం



ఎన్నికల సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో రామారావు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిబ్బంది స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించేలా కృషి చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే సెక్టోరియల్, రూట్ ఆఫీసర్లకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో సిబ్బంది అంతా తమ తమ పనులను పక్కన పెట్టి ఎన్నికల విధుల్లో పూర్తిగా బాధ్యులు కావాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సిబ్బంది ఎక్కడికీ వెళ్లడానికి వీలులేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో ప్రభుత్వ ఉద్యోగులంతా పని చేయాలని, ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో పర్యటించి పోలింగ్ సామగ్రిని అందించేందుకు కేంద్రాల దూరాన్ని గుర్తించి సెక్టార్ అధికారులు సమాచారాన్ని నివేదిక అందించాలన్నారు. ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు ఎప్పటికప్పుడు ఎకౌంట్స్ టీమ్ తెలియజేయాలన్నారు. సెక్టార్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీముకు ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా పది నిమిషాల్లో ఎన్నికల కమిషన్‌కు పంపించాలన్నారు. మోడల్ కోడ్ అమలును పగడ్బందీగా నిర్వహించాల్సిన బాధ్యత పోలీస్, ఎన్నికల సిబ్బందిపై ఉందన్నారు. ఈ దఫా ఎన్నికల పోలింగ్ సమయంలో ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు మొబైల్‌తో అనుమతించేది లేదన్నారు. అనంతరం పలు అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో మాస్టర్ ట్రైనర్స్ జాన్ కెనడీ, సీతారామారావు, శ్రీనివాస్, సెక్టోరియల్, రూట్ ఆఫీసర్ల సిబ్బంది, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్, రంగరాయ అడ్మినిస్ట్రేటర్‌గా శ్రీధర్



అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్, రంగరాయ వైద్య కళాశాలల అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ నూకతోటి శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌కు ఆయన జాయినింగ్ రిపోర్టు సమర్పించారు. 2007లో డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన తాళ్లరేవు, అడ్డతీగలలో పనిచేశారు. 2009లో తహసీల్దార్‌గా పదోన్నతి పొంది అమలాపురం, రాజమహేంద్రవరం, రంపచోడవరం డివిజన్లలో విధులు నిర్వర్తించారు. చింతూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన కోవిడ్ వేళ కీలకంగా వ్యవహరించి కేసులను 220కి పరిమితం చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రభుత్వ ప్రయోజనాలను సకాలంలో ప్రజలకు అందించడమే కాకుండా, ఎన్‌జీవోలు చింతూరు పరిధిలో సేవలందించేందుకు వారిని ప్రోత్సహించడంలో ఆయన కృషి చేశారు. ఇటువంటి సేవలు అందించిన ఆయనకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి సుమారు మూడు జిల్లాల ప్రజలకు ప్రాణప్రదాయినిగా ఉన్న జీజీహెచ్‌కు, వైద్య విద్యలో అగ్రగామి రంగరాయ వైద్య కళాశాలకు సంయుక్త అడ్మినిస్ట్రేటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కాకినాడ జీజీహెచ్‌లో ఆయనకు ప్రత్యేక చాంబర్ ఏర్పాటైంది. జీజీహెచ్ వైద్యుల బృందంతో పాటు, మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో ఉద్యోగులు శ్రీధర్‌ను సాదరంగా ఆహ్వానించారు. తొలి రోజు ఆయన జీజీహెచ్, ఆర్‌ఎంసీలలో వివిధ విభాగాలను పరిశీలించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు




దుర్గాడలో మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పిఠాపురం ఉద్యానశాఖాధికారి శైలజ

పిఠాపురం: మామిడి సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పిఠాపురం ఉద్యానశాఖాధికారి కేఎస్ శైలజ అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో శుక్రవారం తోటబడి నిర్వహించారు. మామిడి సాగు చేస్తున్న రైతులకు సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోటలు ప్రస్తుతం పూత, పిందె దశ ఉన్నాయన్నారు. రైతులు ప్రతీరోజూ మామిడి తోటలను పరిశీలించి ఏదైనా తేడా కనిపిస్తే వెంటనే రైతు భరోసా కేంద్రంలోని ఉద్యానవన సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రస్తుతం మంచు కారణంగా తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే తెగుళ్ల, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, ఉద్యాన సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు రెడీ !

- పాదగయ క్షేత్రంలో ఈ నెల 6 నుంచి 11 వరకూ ఉత్సవాలు
- జోరుగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- 4 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా



విద్యుత్ కాంతుల నడుమ పాదగయ క్షేత్రం



పుణ్యస్నానాలకు సిద్ధమైన పుష్కరిణి

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఈ ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలను కన్నులపండువగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాదగయలో ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నారు. 6న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉత్సవాలను పురస్కరించుకుని పాదగయ క్షేత్రాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలకు ఏర్పాటు చేస్తున్నారు.

వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు

జిల్లాలోని పుణ్యక్షేత్రాల్లో పాదగయకు విశిష్టస్థానం ఉంది. త్రిగయ క్షేత్రాల్లో పిఠాపురం పాదగయ క్షేత్రం అత్యంత ప్రాచీనమైనది. ఏటా మహాశివరాత్రి పర్వదినాన ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతుంది. పిఠాపురం నియోజకవర్గంలో ప్రాముఖ్యత కలిగిన శివాలయం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వారంరోజుల పాటు ప్రతినిత్యం పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్షపత్రి పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహిస్తారు.

పుణ్యస్నానాలకు పుష్కరిణి సిద్ధం

మహాశివరాత్రి ఉత్సవాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన పుణ్యస్నానాలకు పాదగయ పుష్కరిణిని అధికారులు సిద్ధం చేశారు. ఇటీవల పుష్కరిణిలో పాత నీరు తొలగించిన అధికారులు పుష్కరిణిని పూర్తిగా శుభ్రం చేశారు. పుష్కరిణికి మరమ్మతులు నిర్వహించి కొత్త నీటిని నింపారు. ఎక్కువ మంది భక్తులు ఒకేసారి పుణ్యస్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేశారు.

6న కుక్కుటేశ్వరుని కల్యాణం

పాదగయక్షేత్రంలో రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామివారి దివ్య కల్యాణం ఈ నెల 6వ తేదీ రాత్రి 8.32 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. 7న స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, 8న మహాశివరాత్రి ఉత్సవం, 9న మధ్యాహ్నం 3 గంటలకు నాకబలి, దండాడింపు, దొంగలదోపు ఉత్సవాలు, స్వామివారి రథోత్సవం, 10న స్వామివారి త్రిశూల స్నానం, 11న స్వామివారి తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం నిర్వహించనున్నారు. పాదగయక్షేత్రంతో పాటు పిఠాపురంలోని సకలేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాలు, గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉమారామలింగేశ్వరస్వామి, గొల్లప్రోలులో ప్రసిద్ధి చెందిన ఉమారామలింగేశ్వర స్వామి, చేబ్రోలులో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి, తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

> **సామాన్య భక్తులకు ప్రాధాన్యం**
>
> మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా సామాన్య భక్తులు ఏటువంటి ఇబ్బంది లేకుండా స్వామివారిని దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే పాదగయ పుష్కరిణిని పూర్తిగా శుభ్రం చేసి కొత్తనీరు నింపాం. విద్యుత్ దీపాలంకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది సుమారు 4 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. దానికి తగ్గట్టుగా ప్రసాదాలు, తాగునీరు, మరుగుదొడ్లు, స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేస్తున్నాం. స్వామివారి దివ్య కల్యాణం ఎక్కువ మంది భక్తులు వీక్షించేలా తగిన జాగ్రత్తలు తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నాం.
>
> – పులి నారాయణమూర్తి ఆలయ ఈఓ

మత్స్యకారులను ఆదుకోండి

కాకినాడ సిటీ: ఓఎన్‌జీసీ పనుల వల్ల నష్టపోతున్న మత్స్యకారులను ఆదుకోవాలని కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ చైర్మన్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆందోళన చేయడం అభినందనీయమన్నారు. రాజకీయాలకు అతీతంగా కాకినాడ ప్రజలు ఉద్యమిస్తే గుజరాత్ తరహాలో ఇక్కడి ప్రజలకు తక్కువ ధరకే ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయవచ్చునని తెలిపారు. దీనిపై హైకోర్టులో పిల్ వేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సమస్యలపై 4వ తేదీ సోమవారం కలెక్టర్‌ను అఖిలపక్షం కలుస్తుందన్నారు. అలాగే ఈనెల రెండోవారంలో కాకినాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు మధు వివరించారు.

సమస్యలు పరిష్కరించండి

తమ డిమాండ్లు పరిష్కరించాలని పంచాయతీల అభివృద్ధికి నిధులు, అధికారాలు తక్షణమే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు వైవిబీ రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు కొనసాగించాలి

భవన నిర్మాణ రంగంలో పని చేసే 53 రకాల వృత్తుల కార్మికులు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలంటూ భవన నిర్మాణ కార్మికులు, వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తూ ఇచ్చిన 1214 సర్క్యులర్ మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, గడిగట్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.